సాక్షి
జగిత్యాల

శుక్రవారం । 2 । మే । 2025

బోనమెత్తిన ఆలూరు



రాయికల్: మండలంలోని ఆలూరులో పోచమ్మ తల్లికి గురువారం గ్రామానికి చెందిన వేలాది మంది మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. విగ్రహ దాత సోమిరెడ్డి సురేందర్‌రెడ్డి, సుజాత దంపతులు, సింగిల్ విండో చైర్మన్ దీటి రాజిరెడ్డి, నాయకులు మెక్కొంద రాంరెడ్డి, రాజేశ్‌యాదవ్, సురతాని మల్లారెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రైతులకు ఇబ్బంది రానీయొద్దు

• కలెక్టర్ సత్యప్రసాద్



కుస్తాపూర్‌లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మల్లాపూర్/మెట్‌పల్లి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి వెంటవెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మల్లాపూర్ మండలం రాఘవపేట, మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల, వేంపేట గ్రామాల్లోని కేంద్రాలను తనిఖీ చేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. నిర్వాహకులు కేంద్రాల వద్ద వసతులు కల్పించాలని, తేమ శాతం పరిశీలన, రికార్డుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని పేర్కొన్నారు. సన్నం రకం ధాన్యానికి రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేయాలని తెలిపారు. డీఆర్డీవో రఘువరణ్, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వీర్‌సింగ్, ప్యాక్స్ సీఈవో రమేశ్, రైతులు పాల్గొన్నారు.

పల్లెపల్లెకూ ఆర్టీసీ సేవలు



జగిత్యాల నుంచి దీకొండకు బస్సు ప్రారంభిస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి: రోడ్డు సౌకర్యమున్న ప్రతి గ్రామానికి టీఎస్ ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చేందుకు కృషి చేస్తానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రం నుంచి పెగడపల్లి మండలం నంచర్ల, దీకొండ గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీస్ సేవలను రాములపల్లి గ్రామంలో గురువారం ఆర్టీసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. రాములపల్లి నుంచి దీకొండ వరకు ప్రయాణికులతో కలిసి ప్రయాణించారు. డిపో మేనేజర్ కల్పన, ఎంఎఫ్ కవిత, ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ బకాయిలు త్వరితగతిన చెల్లించాలి

జగిత్యాల: సీఎంఆర్ బకాయిలు త్వరితగతిన చెల్లించాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్‌లో రైస్‌మిల్లర్లతో సమీక్షించారు. రోజువారి లక్ష్యం ప్రకారం మిల్లుల నుంచి సీఎంఆర్ డెలివరీ చేయించాలని, ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రాము

జగిత్యాల: వేసవి శిబిరాలను వినియోగించుకోవాలని డీఈవో రాము అన్నారు. పురాణిపేట ఉన్నత పాఠశాలలో వేసవి శిబిరాలను గురువారం ప్రారంభించారు. 15ఏళ్లలోపు విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వేదిక్, గణితం, సంగీతం, ఆటలు, ఇంగ్లిష్, యోగా వంటి అంశాల్లో మెళకువలు నేర్పిస్తారని, స్నాక్స్, తాగునీరు ఉచితంగా అందిస్తారని తెలిపారు. కో–ఆర్డినేటర్లు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కార్మికుల ప్రయోజనం కోసం ప్రత్యేక చట్టాలు



మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ నాగేశ్వర్‌రావు

మెట్‌పల్లి: కార్మికుల ప్రయోజనం కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని మెట్‌పల్లి సీనియర్ సివిల్ మేజిస్ట్రేట్ నాగేశ్వర్‌రావు అన్నారు. కార్మిక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అంతకు ముందు పలువురు న్యాయవాదులు ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్ తదితర వాటిపై వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంతి మోహన్‌రెడ్డి, న్యాయవాదులు ఉన్నారు.

బల్దియాల్లో పన్ను బాదుడు

• ఆస్తి పన్ను భారీ మొత్తంలో పెంచిన ప్రభుత్వం
• గత ఆర్థిక సంవత్సరం నుంచే అమలు
• ఆందోళనలో దిగువ, మధ్యతరగతి ప్రజలు



మెట్‌పల్లి పట్టణం

మెట్‌పల్లి: మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నును ప్రభుత్వం భారీగా పెంచింది. గత ఆర్థిక సంవత్సరం నుంచే ఈ పెంపును అమలు చేస్తుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. పట్టణీకరణలో భాగంగా మున్సిపాలిటీలు రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. అందుకు అనుగుణంగా ఆదాయవనరులు లేకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా వసతులు కల్పన, సిబ్బందికి వేతనాలు చెల్లించడం ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం స్తి పన్నును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే ఒక్కసారిగా రెండు, మూడింతలు పెంచడం విమర్శలకు తావిస్తోంది.

జియో ట్యాగింగ్ కొలతల ఆధారంగా..

- పట్టణ ప్రాంతాల్లో ఇంటి పన్నును సరిగ్గా లెక్కించి వసూలు చేయడానికి ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ప్రతి మున్సిపాలిటీలో జియో ట్యాగింగ్ సర్వే నిర్వహించింది.
- ఆ సర్వేలో భాగంగా ప్రతి ఇంటిని అక్షాంశం, రేఖాంశం ఆధారంగా గుర్తించడంతోపాటు ఇంటి కొలతలు, ఇతర వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేశారు.
- ప్రస్తుతం ఆ కొలతలను పరిగణనలోకి తీసుకునే ప్రతి ఇంటికి ఆస్తి పన్నును పెంచినట్లు అధికారులు చెబుతున్నారు.
- ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి రాక ముందు సిబ్బంది కొలతలు వేయకుండా నామమాత్రంగా పన్ను వేసి వసూలు చేసేవారు. దీనివల్ల మున్సిపల్ ఆదాయానికి గండి పడేది.
- జియో ట్యాగింగ్‌తో పక్కా కొలతలతో లెక్కింపు జరిగి దానికి అనుగుణంగా పన్ను వసూలు జరుగుతోంది.

బెంబేలెత్తిపోతున్న ప్రజలు..

- చాలాకాలం పాటు ఆస్తి పన్నును పెంచకుండా ఉన్న ప్రభుత్వం.. ఒక్కసారిగా జియో ట్యాగింగ్‌ను పరిగణనలోకి తీసుకుని పెద్ద మొత్తంలో భారం మోపడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.
- కొందరికి పన్ను రెట్టింపు అయితే.. మరికొందరికి రెండింతలు, మూడింతలే కాకుండా అంతకంటే ఎక్కువ పెరిగింది.
- మెట్‌పల్లి మున్సిపాలిటీలోని కళానగర్‌లో ఓ ఇంటికి గతంలో రూ.2వేలు పన్ను ఉంటే.. ఇప్పుడు అది రూ.7900కు పెరిగింది. ఇదే కాలనీలో మరో ఇంటికి గతంలో రూ.1050 ఉంటే, ప్రస్తుతం రూ.4500కి పెరిగింది.
- ఇలా ప్రతి కుటుంబంపై అధిక భారం పడడంతో దిగువ, మధ్యతరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు

- జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలు ఉన్నాయి.
- ఇంటి అనుమతులు, ప్రకటనలు, నల్లా బిల్లు, ఆస్తి పన్నుల ద్వారా ఆదాయం సమకూరుతోంది. ప్రధానంగా ఆస్తి పన్నుతోనే ఎక్కువ ఆదాయం వస్తోంది.
- ఐదు మున్సిపాలిటీల్లో 62,585 ఇళ్లు ఉన్నాయి. ఏటా ఆస్తి పన్ను ద్వారా సుమారు రూ.17కోట్ల ఆదాయం సమకూరుతోంది.
- వీటిలో చాలాకాలంగా ఆస్తి పన్నును సవరించలేదు.
- పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా ఆదాయం లేకపోవడంతో మున్సిపాలిటీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.
- దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో పన్నును పెంచింది.

కొలతల ప్రకారమే పన్ను విధింపు



ప్రతి ఇంటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి గతంలోనే కొలతలు వేశారు. ప్రస్తుతం వాటిని పరిగణనలోకి తీసుకుని ఆస్తి పన్నును సవరించాం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లోనూ ప్రభుత్వం సవరించింది. ఎక్కడైనా పొరపాట్లు జరిగితే ప్రజలు మా దృష్టికి తీసుకరావాలి. వాటిని పరిశీలించి తగు చర్యలు చేపడుతాం.

– అక్షయ్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, మెట్‌పల్లి

అక్కడో.. ఇక్కడో.. ఎక్కడో..?



చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయం

'నవోదయ'కు స్థల సేకరణలో జాప్యం

• కోరుట్ల, సంగెంలో ఏర్పాటుకు నిర్ణయం?
• ఈ ఏడాది తరగతులు ప్రారంభమయ్యేనా..?

జగిత్యాల: జిల్లాకు మంజూరైన జవహర్ నవోదయ పాఠశాల ఏర్పాటు ప్రక్రియ ముందుకు కదలడం లేదు. నవోదయ మంజూరైన తొలి రోజుల్లో ధర్మపురి నియోజకవర్గంలోని నేరెళ్లలో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా 37 ఎకరాల స్థలాన్ని కూడా కేటాయించారు. అయితే ధర్మపురి నియోజకవర్గం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోకి రావడంతో కొందరు దానిని జగిత్యాల పార్లమెంట్ పరిధిలోకి తీసుకురావాలని స్థానిక ఎంపీ అర్వింద్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో నేరెళ్లలో ఏర్పాటును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంపై ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఎంపీ వంశీకృష్ణతో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు వినతిపత్రం కూడా అందించారు.

కోరుట్లలో ఏర్పాటుకు సిద్ధం

నేరెళ్లలో నవోదయ పాఠశాల ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోవడంతో కోరుట్లలో ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కోరుట్లలో పూర్తిస్థాయి సౌకర్యాలున్నట్లు అధికారులు గుర్తించారు. పైగా కోరుట్ల నిజామాబాద్ ఎంపీ అర్వింద్ సొంత నియోజకవర్గం కావడంతో అధికారులు కూడా ఇక్కడే ఏర్పాటు చేసేందుకు మొగ్గు చూపారు. పట్టణ శివారులోని సంగెం రోడ్డులోగల జంబిగద్దె వద్ద ఉన్న 30 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు ప్రతిపాదించారు. అయితే ఇక్కడ కూడా ఇంతవరకు ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. వాస్తవానికి ఈ విద్యాసంవత్సరం నుంచే నవోదయ తరగతులు ప్రారంభించాలని కేంద్రం ఆదేశాలు కూడా ఇచ్చింది. అయినా ఇప్పటివరకు అడుగు ముందుకు పడకపోవడం గమనార్హం. ఒకవేళ ఈ విద్యా సంవత్సరంలోనే తరగతులు ప్రారంభించాల్సి వస్తే సుమారు 20 నుంచి 30 గదులు ఉన్న భవనం తప్పనిసరి. ఇందుకోసం కోరుట్లలోని వేములవాడ రోడ్‌లోగల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించినా.. అది అనువుగా లేదని సమాచారం. దానికి మరమ్మతు చేయిస్తేనే సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు. ఇంకా ప్రారంభంకాని నవోదయ పాఠశాలకు ప్రస్తుతం చొప్పదండిలోని జవహర్ నవోదయ పాఠశాల ప్రిన్సిపల్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

నవోదయతో ప్రయోజనం

నవోదయలో విద్యార్థికి సీటు రావాలంటే 5వ తరగతి నుంచే కోచింగ్ తీసుకుంటుంటారు. ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు అర్హత పరీక్ష ఆధారంగా 6వ తరగతిలో ప్రవేశం కల్పిస్తారు. ఇందులో 12వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో సీబీఎస్‌ఈ విద్య అందిస్తారు. ఒకవేళ ఈ విద్యాలయం ఏర్పాటైతే 600 మందికిపైగా ప్రయోజనం కలుగుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ విద్యార్థులకు 25 శాతం కేటాయిస్తుంటారు.

ఆదేశాలున్నాయి

ఈ విద్యాసంవత్సరం నుంచే నవోదయ పాఠశాల తరగతులు ప్రారంభించాలని ఆదేశాలున్నాయి. ప్రస్తుతం కోరుట్ల ప్రాంతంలోని సంగెం వద్ద స్థలాన్ని చూశాం. తాత్కాలిక భవనం కోసం చూస్తున్నాం. ఇందుకు గురుకుల పాఠశాలను చూశాం. మరమ్మతు చేయిస్తే అందులో కొనసాగించే అవకాశం ఉంది.

– మంగతాయారు, నవోదయ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

వ్యవసాయ కళాశాల తరలించొద్దు



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

జగిత్యాల: కోరుట్లలోని మహిళా అగ్రికల్చర్ కళాశాల తరలింపును ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి తిరుపతి అన్నారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ హయాంలో మహిళా అగ్రికల్చర్ కళాశాలను జిల్లాలో ఏర్పాటు చేసిందని, వెల్గటూర్ మండలం స్తంభంపల్లి వద్ద శాశ్వత భవన నిర్మాణానికి 70 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని గుర్తు చేశారు. కోరుట్లలో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సిద్దిపేట జిల్లా బెజ్జంకికి తరలించేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఏఐఎస్‌ఎస్ కన్వీనర్ మాణిక్ మాట్లాడుతూ ఈ ప్రాంతానికి అదనంగా యూనివర్సిటీ, విద్యాసంస్థలు, పరిశ్రమలు తీసుకురావాల్సిందిపోయి ఉన్న వాటిని తరలించడం సిగ్గుచేటన్నారు. బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వంశీ మాట్లాడుతూ అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ దూరదృష్టితో ఈ జిల్లాలో అగ్రికల్చర్ కళాశాలను ఏర్పాటు చేస్తే దానిని తరలించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి వినోద్‌కుమార్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాకేశ్, మైనార్టీ విద్యార్థి అధ్యక్షుడు సోహెల్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, వెంకటేశ్, రాజు, నరేశ్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

• ఎస్పీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో నేరాలపై సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై పురోగతిపై చర్చించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత, నిర్వహణ, రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి అధికారులతో సమీక్షించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం అందించాలని సూచించారు. నేరం జరిగిన స్థలంలో క్లూస్ ఎలా సేకరించాలనే అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. మూడు కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు, మరో కేసులో పదేళ్ల జైలుశిక్ష విధించడంలో కృషి చేసిన పీపీ మల్లికార్జున్, అడిషనల్ పీపీ మల్లేశంను ఎస్పీ అభినందించారు. జిల్లాకేంద్రంలో ఇటీవల జరిగిన భారీ దొంగతనాలను తక్కువ సమయంలో చేధించి దొంగలను పట్టుకున్న పట్టణ సీఐ వేణుగోపాల్‌ను ఎస్పీ అభినందించారు. గ్రూప్–1, గ్రూప్–3 పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన పోలీసు అధికారులకు ప్రశంసపత్రాలు అందించారు.

మల్యాల ఎస్సై నరేశ్‌కు అభినందన

మల్యాల: ఎస్సై నరేశ్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు. పోలీస్‌స్టేషన్ విధులు, సత్వర కేసుల నమోదు, నేరాల నియంత్రణ, బందోబస్తు నిర్వహణకు గాను ఉత్తమస్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ప్రశంస పత్రం అందించారు.

భూభారతిపై పోలీసులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో

జగిత్యాలక్రైం: భూభారతి చట్టంపై ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులకు గురువారం ఆర్డీవో మధుసూదన్ అవగాహన కల్పించారు. చట్టంలోని ముఖ్యాంశాలు, ప్రయోజనాలను ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. ప్రభుత్వ భూముల రక్షణ, ప్రజల హక్కుల హామీ, భూవివాదాల పరిష్కారంలో పారదర్శకత పెంపు వంటి అంశాలపై వివరించారు. అదనపు ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రఘుచందర్, వేణుగోపాల్, సీఐలు వేణుగోపాల్, రవి, కృష్ణారెడ్డి, రాంనర్సింహారెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.





తిరిగొచ్చిన నీలగిరి పెద్దమ్మతల్లి

• మెట్‌పల్లి నుంచి శోభాయాత్రగా ముత్యంపేటకు
• భారీగా తరలివచ్చిన భక్తులు

మల్లాపూర్: మల్లాపూర్ మండలం ముత్యంపేటలోని నీలగిరి పెద్దమ్మతల్లి అర్ధకాన్ని పూర్తి చేసుకుని మెట్‌పల్లి నుంచి శోభాయాత్రగా డప్పుచప్పుళ్లు, పోతురాజుల విన్యాసాల మధ్య ముత్యంపేటకు చేరుకున్నారు. ఆనవాయితీ ప్రకారం.. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో తాత్కాలికంగా ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీడీసీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలను ఐదేళ్లకోమారు ఘనంగా నిర్వహిస్తామన్నారు. మల్లాపూర్, మెట్‌పల్లి ఎస్సైలు రాజు, కిరణ్ బందోబస్తు చేపట్టారు. కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి, డీసీసీబీ జిల్లా డైరెక్టర్ తక్కళ్ల నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసమే రిజర్వేషన్లు



క్షీరాభిషేకం చేస్తున్న అడ్లూరి, జీవన్‌రెడ్డి

• ప్రభుత్వ విప్ అడ్లూరి, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: రిజర్వేషన్ల అమలుతోనే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీమంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. కేంద్రప్రభుత్వం కులగణన చేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తూ జిల్లాకేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టాలన్న కాంగ్రెస్ డిమాండ్ మేరకు ప్రధాని మోదీ విధిలేని పరిస్థితుల్లో ఒప్పుకున్నారని తెలిపారు. కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పీసీసీ కార్యదర్శి బండ శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

పట్టణాన్ని శుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని జీవన్‌రెడ్డి అన్నారు. కార్మిక దినోత్సవానిన పురస్కరించుకుని బల్దియా ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. కార్మికులకు ఇన్సూరెన్స్ వర్తింపచేయడంతోపాటు సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తానన్నారు. బల్దియా కమిషనర్ స్పందన, మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



తిప్పన్నపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లత

జగిత్యాలరూరల్: కొనుగోళ్ల వివరాలు వెంటవెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అడిషనల్ కలెక్టర్ లత అన్నారు. గురువారం జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట, రూరల్ మండలం హైదర్‌పల్లిలో కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు, రవాణా, తూకం, హమాలీ పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. రైతుల నుంచి ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ పాస్‌బుక్ తీసుకుని వివరాలు నమోదు చేయాలన్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు రాంమోహన్, శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దార్ తిరుపతి, కార్తీక్‌రెడ్డి, డీటీలు వరప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఏపీఎం గంగాధర్, సీసీ విద్యాసాగర్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం తూకం త్వరగా చేపట్టాలి

సారంగాపూర్: ధాన్యం తూకం త్వరగా చేపట్టాలని అదనపు కలెక్టర్ అన్నారు. మండలకేంద్రంతోపాటు రేచపల్లి, నాయికపుగూడెం, మ్యాదారం తండా, బీర్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. వచ్చిన ధాన్యాన్ని తేమ శాతం గుర్తించి తూకం వేయాలన్నారు. ట్యాబ్ ఎంట్రీలు పూర్తిచేయాలని ఆదేశించారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలని ధర్నా



రోడ్డుపై ధర్నా చేస్తున్న వీరాపూర్ రైతులు

రాయికల్: మండలంలోని వీరాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఉప్పుమడుగు–ఆలూరు క్రాస్ రోడ్ వద్ద బైఠాయించారు. రైతులు మాట్లాడుతూ సహకార సంఘం ఆధ్వర్యంలో కేంద్రం ఏర్పాటు చేసి 15 రోజులు గడుస్తున్నా.. హమాలీలు లేకపోవడంతో ఒక్క గింజ కూడా కొనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఖయ్యూం, ఎస్సై సుధీర్‌రావు సంఘటన స్థలానికి వెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రైతులు రామస్వామిగౌడ్, గంగాధర్, సోమ వెంకటేశ్, మహిపాల్, స్వామిరెడ్డి, షేక్ మాలిక్, ఇస్మాయిల్, నర్సారెడ్డి, అంజయ్య, రాములుగౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉప్పుమడుగు సహకార సంఘం కార్యదర్శి సస్పెన్షన్

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి తిరుపతిని సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పాటు హమాలీలను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

కట్నం కేసు నమోదు

జమ్మికుంట: అదనపు కట్నం తేవాలని వేధిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామానికి చెందిన శ్రీమతికి భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం అకినపల్లి గ్రామానికి చెందిన గుత్తికొండ భీష్మాచారితో 13ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఆ సమయంలో శ్రీమతి తల్లిదండ్రులు అడిగిన కట్నకానుకలు అందజేశారు. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. కొన్నాళ్లుగా శ్రీమతిని భర్త భీష్మాచారి, అత్త మల్లమ్మ, ఆడపడుచులు పొనగంట మమత, బావండ్లపల్లి రజిత, మరిది గుత్తికొండ అశోక్ అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

జమ్మికుంట: యూఎస్‌ఏలో ఉన్నత చదువు కోసం టికెట్ బుక్ చేస్తానని మోసం చేసిన ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వి.రవి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధి కొత్తపల్లి గ్రామానికి చెందిన వొల్లాల రవీంద్రనాథ్‌గౌడ్ వద్ద కరీంనగర్‌కు చెందిన అమృత ట్రావెల్స్ అండ్ టూర్స్ యజమాని దయ్యాల సతీశ్ 2023లో టికెట్ బుక్ చేస్తానని రెండు దపాలుగా రూ.6లక్షలు తీసుకున్నాడు. డబ్బులు తీసుకొని పని చేయాలేదని, మోసపోయినట్లు గుర్తించి బాధితుడి ఫిర్యాదుతో దయ్యాల సతీశ్, నవీన్, దయ్యాల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రక్తస్రావంతో గృహిణి మృతి

పెద్దపల్లిరూరల్: భోజన్నపేట గ్రామానికి చెందిన చెల్కల సంధ్య(29) అనే గృహిణికి తీవ్ర రక్తస్రావమై గురువారం మరణించింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన సంధ్యకు 12 ఏళ్లక్రితం భోజన్నపేటకు చెందిన చెల్కల శ్రీనివాస్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. అయినా, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోలేదు. ఈక్రమంలో సంధ్య ఇటీవల మళ్లీ గర్భం దాల్చింది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, మళ్లీ సంతానం కలిగితే పోషించడం కష్టమని దంపతులు భావించారు. గర్భం తొలగిపోయేలా ఓ మెడికల్‌షాపు నుంచి తీసుకొచ్చిన ట్యాబ్లెట్లను సంధ్య గురువారం మింగింది. కాసేపటికే రక్తస్రావం మొదలైంది. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే భర్త.. నేల చదును చేసే పనుల కోసం వెళ్లాడు. దీంతో ఆస్పత్రికి తీసుకెళ్లే వారు లేకపోవడంతో సంధ్య ఇంట్లో అలాగే పడిఉంది. పిల్లలు రోదిస్తుండడంతో ఇరుగు పొరుగువారు వచ్చి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తీవ్రరక్తస్రావం కావడంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

మామిడి మార్కెట్‌తో ఉపాధి

- పొరుగు రాష్ట్రాల నుంచి కూలీల రాక
- వసతులు కల్పించడంలో వ్యాపారుల నిర్లక్ష్యం

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాలలోని చల్‌గల్ మామిడి మార్కెట్ కూలీలకు ఉపాధి మార్గంగా మారింది. ఈ మార్కెట్‌లో మామిడి సీజన్‌లో పనిచేసేందుకు స్థానిక కూలీలేకాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ నుంచి వస్తుంటారు. వేల సంఖ్యలో కూలీలు వస్తున్నప్పటికీ వారితో పనిచేయించుకునే వ్యాపారులు, మార్కెటింగ్ శాఖ పట్టించుకోకపోవడంతో వారికి కనీస వసతులు కరువయ్యాయి.

వేల సంఖ్యలో కూలీలు

మామిడి సీజన్ ఏప్రిల్, మే నెలల్లో కొనసాగుతుంది. ఈ సీజన్‌లో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలో రోడ్ల వెంబడి వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని రైతుల నుంచి మామిడి కాయలు కొనుగోలు చేస్తుంటారు. వాటిని ట్రాక్టర్ల నుంచి దింపేందుకు.. కాయలను గ్రేడింగ్ చేసి ప్యాకింగ్ చేసేందుకు.. లారీల్లో లోడ్ చేసేందుకు ఎక్కువ సంఖ్యలో కూలీలు అవసరమవుతారు. తోటల్లో కాయలు తెంపేందుకు కూడా కూలీల అవసరం ఎక్కువ. ఈ పనులు చేసేందుకు స్థానికంగా కూలీలు దొరక్కపోవడంతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు కూలీలను రప్పిస్తుంటారు. ఒక్కో వ్యాపారి దుకాణంలో కనీసం 50 మంది వరకు కూలీలు పనిచేస్తుంటారు.

నెలరోజుల్లో రూ.25వేల నుంచి రూ.30వేల ఆదాయం

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలను వ్యాపారులు వివిధ పనులకు ఉపయోగించుకుంటారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ కూలీలను మామిడి కాయలను తెంపేందుకు, లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు ఉపయోగిస్తారు. ఢిల్లీ, రాజస్థాన్ నుంచి వచ్చిన కూలీలను మామిడికాయల గ్రేడింగ్.. ప్యాకింగ్‌కు ఉపయోగిస్తారు. కూలీలు గ్రూపుగా ఏర్పడి పనులు చేస్తుండటంతో టన్ను అన్‌లోడ్ చేస్తే రూ.250 వరకు చెల్లిస్తారు. గ్రేడింగ్.. ప్యాకింగ్ చేసే వారికి ట్రేకు రూ.15, పెట్టెలను లారీల్లో లోడ్ చేస్తే రూ.3వేల నుంచి రూ.5 వేలు, కాయలు తెంపడానికి వెళ్తే రోజుకు రూ.500 చెల్లిస్తారు. ఆ వ్యాపారి



మామిడి మార్కెట్‌లో గ్రేడింగ్ చేస్తున్న ఉత్తరప్రదేశ్ కూలీలు

దుకాణానికి వచ్చిన కాయలను బట్టి ఒక్కో కూలీ కనీసం 30నుంచి40 రోజుల్లో రూ.30వేల నుంచి రూ.50 వేలు సంపాదించుకుంటారు. ఆయా రాష్ట్రాల్లో వేసవి సీజన్‌లో పనులు లేకపోవడంతో పనుల కోసం జగిత్యాల వస్తుంటారు. ఇలా జిల్లాకు కనీసం ఐదారు వేల మంది కూలీలు వస్తుంటారు.

వసతులు అంతంతే..

మార్కెట్లో కూలీలతో పనులు చేయించేందుకు చూపుతున్న శ్రద్ధ.. వారికి కనీస వసతులు కల్పించడంతో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. మండుతున్న ఎండలో మార్కెట్ పక్కనున్న వ్యవసాయ భూముల్లో ప్లాస్టిక్ కవర్లతో గుడారాలు వేసుకుని ఉండటం.. షెడ్ల కింద పడుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో వారి బాధలు



లారీల్లో లోడ్ చేస్తున్న మహారాష్ట్ర కూలీలు

వర్ణనాతీతం. చాలామంది రోడ్డపక్కనున్న చెట్ల కింద తీరుతున్నారు. ఈ క్రమంలో వారిని పనులకు తీసుకొస్తున్న వ్యాపారులు వారికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉందని స్థానికులు అంటున్నారు.

ఏటా వస్తుంటాం



ఏటా మామిడి సీజన్‌లో జగిత్యాలకు వస్తుంటాం. నెల రోజులపాటు ఇక్కడ పనిచేస్తాం. రూ.30వేల వరకు సంపాదించుకుంటాం. మహారాష్ట్రలో పనులు లేకపోవడంతో ఉపాధి కోసం ఇక్కడకు వస్తాం.
– సేవాలాల్, మహారాష్ట్ర

ప్యాకింగ్ చేస్తాం



మామిడికాయలను గ్రేడింగ్ చేసి, ప్యాకింగ్ చేసేందుకు ఇక్కడకు వస్తాం. మా రాష్ట్రం నుండి కనీసం 500 మంది వరకు వచ్చాం. మామిడి మార్కెట్లో ఏదో పని దొరుకుతుందనే ఆశతో వచ్చి, ఎంతో కొంత సంపాదించుకుని వెళ్లతాం.
– గుడ్డె, ఉత్తరప్రదేశ్

టెంట్‌హౌజ్‌లో అగ్నిప్రమాదం

ధర్మపురి: టెంట్‌హౌజ్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగి లక్షల విలువ చేసే సామగ్రి దగ్ధమైంది. బాధితుడు షబ్బీర్ కథనం ప్రకారం.. పట్టణంలోని నక్కలపేట రూట్‌లో ఉన్న టెంట్‌హౌజ్‌లో గురువారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు గోదాంలో ఉన్న టెంట్ సామగ్రికి నిప్పంటించారు. పెద్ద ఎత్తున మంటల చెలరేగడంతో చుట్టుపక్కల వారు షబ్బీర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన ఫైరింజన్‌కు ఫోన్‌చేయగా.. సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పేశారు. మంటల్లో టెంట్ సామానుతోపాటు డెకరేషన్ సామగ్రి, థర్మకోల్, ప్లాస్టిక్ ఫ్లవర్స్ కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.15లక్షల వరకు సామగ్రి దగ్ధమైందని బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.



కాలిపోయిన సామగ్రి

తడగొండ జీపీలో చొరబడ్డ ఆగంతకులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడగొండ గ్రామపంచాయతీ భవనంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని ఆగంతకులు హంగామా చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. వాటర్ ప్లాంట్ గది తాళం పగులకొట్టి, కాయిన్ బాక్స్‌లోని నాణేలను బయట పారబోశారు. అనంతరం జీపీ గది మెయిన్ డోర్ తలుపులు పగులకొట్టి బీరువాలోని ఉన్న కాగితాలు, రిజిష్టర్లను చిందర వందరగా పడేశారు. గురువారం ఉదయం ఎంపీవో శ్రీధర్, పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్స్ టీం ఆధారాలను సేకరించింది. పంచాయతీ కార్యదర్శి సుమలత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు.



చిందరవందరగా కార్యదర్శి గదిలో రికార్డులు

అత్యుత్తమ మహిళా కళాశాలగా 'అల్ఫోర్స్'

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ సూర్యనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాలకు తెలంగాణలో ఉత్తమ మహిళా డిగ్రీ కళాశాలగా అవార్డు లభించింది. ఢిల్లీలోని ఆసియా టుడే మీడియా సంస్థ నిర్వహించిన ప్రపంచ విద్యా సమ్మిట్–2025లో కేంద్ర జలశక్తి సహాయ మంత్రి భూషణ్ చౌదరి, పీజీ కమిషన్ కౌన్సిలర్ నీలేశ్ కుమార్, ఢిల్లీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మోహన్‌సింగ్ చేతుల మీదుగా అవార్డును కళాశాల కరస్పాండెంట్ వూట్కూరి రవీందర్‌రెడ్డి స్వీకరించారు. విద్య, నైపుణ్యం, శాస్త్రీయ దృష్టి, నైతిక విలువలు, ప్రాంగణ నియామకాలు, ఉత్తీర్ణతశాతం, విద్యార్థి అధ్యాపకుల నిష్పత్తి, కళాశాల సాధించిన ప్రగతిని పరిగణలోకి తీసుకొని అవార్డు ప్రకటించిందని తెలిపారు.



అవార్డు స్వీకరిస్తున్న రవీందర్‌రెడ్డి

బీజేపీకి గుణపాఠం తప్పదు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: కార్మికులు తమ హక్కులను పోరాడి సాధించుకున్నారని, బీజేపీ వారి హక్కులను హరిస్తే కార్మిక లోకం చూస్తూ ఊరుకోదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రైల్వే హమాలీ సంఘం కార్మికులు ఏర్పాటుచేసిన పతాకాన్ని ఆవిష్కరించారు. రైల్వే గేట్ నుంచి బద్దం ఎల్లారెడ్డి భవన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య జెండా ఆవిష్కరణ చేశారు. సిమెంట్ గోదాం, ఫర్టిలైజర్ హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండాను ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం చాడవెంకటరెడ్డి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11ఏళ్లు గడుస్తున్నప్పటికీ కార్మిక హక్కులను హరించడానికి కుటీల ప్రయత్నం చేస్తోందన్నారు. దేశంలోని కార్మికవర్గం అంతా మేడే స్ఫూర్తిగా హక్కుల కోసం పోరాటం చేయాలని, ఈనెల 20న జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ అనుబంధ రైల్వే హమాలీ సంఘం అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి దాసరి ప్రభాకర్, రవీందర్, బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వెలండి దామోదర్, ఉల్లిగడ్డల హమాలీ సంఘం అధ్యక్షుడు నర్సింహులు, కొమురయ్య, సిమెంట్ గోదాం ఫర్టిలైజర్ హమాలీ సంఘం అధ్యక్షుడు జంగా తిరుపతి, నన్నవేన కొమురయ్య, కదారి బీరయ్య, మామిడిపెల్లి శంకర్, ఆకుల లచ్చన్న, ప్రకాశం గంజ్ ట్రాలీ ఆటో యూనియన్ నాయకులు ప్రభాకర్, కాల్వ రాయమల్లు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

ప్రాణం తీసిన రీల్స్ సరదా

- మానేరువాగులో పడి యువకుడి మృతి



మహ్మద్ అర్బాస్ (ఫైల్)

కరీంనగర్‌క్రైం: సోషల్ మీడియా రీల్స్ సరదా ఒక యువకుడి ప్రాణాలు తీసింది. రీల్స్ చేయడానికి కరీంనగర్ శివారులోని మానేరు వాగులోకి దిగిన యువకుడు ప్రమాదవశాత్తు అందులో మునిగి మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన మహ్మద్ లతీఫ్‌కు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు మహ్మద్ అర్బాస్ (20) గురువారం మధ్యాహ్నం తన ఇద్దరు స్నేహితులతో కలిసి మానేరు బ్రిడ్జి సమీపంలోని రీల్స్ చేయడానికి వెళ్లాడు. అర్బాస్ మానేరు వాగులోకి దిగి రీల్స్ చేస్తున్న క్రమంలో లోతైన ప్రదేశంలోకి వెళ్లడంతో ప్రమాదవశాత్తు అందులో మునిగిపోయాడు. స్నేహితులు స్థానికులను పిలిచి వారి సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అర్బాస్ అప్పటికే మృతిచెందాడు. అర్బాస్ తండ్రి లతీఫ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

147 కిలోల గంజాయి స్వాధీనం

వరంగల్ క్రైం: చింతగట్టు ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర రూ.73.65లక్షల విలువ గల 147 కిలోల ఎండు గంజాయిని పట్టుకున్నట్లు నార్కోటిక్ డీఎస్పీ సైదులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుకుమామిడి నుంచి నిజామాబాద్‌కు తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో తనిఖీ చేయగా.. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల సదయ్య, హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన సామల శేషు కలిసి ఇన్నోవా, షిఫ్ట్ కార్లలో 69ప్యాకెట్ల గంజాయిని తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. సదయ్య, సతీశ్‌పై 2014, 2016లో కేయూసీ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు.

జాతీయ పోటీలకు లౌక్యశ్రీ ఎంపిక



లౌక్యశ్రీ

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నారవేన లౌక్యశ్రీ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ జిట్టబోయిన శ్రీను తెలిపారు. కర్ణాటకలోని మండ్య జిల్లాలో ఈనెల 1నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే 39వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థిని హెచ్‌ఎం మిడిదొడ్డి సమ్మయ్య, ఉపాధ్యాయులు రాజయ్య, దేవదాస్, ప్రకాశ్, శ్రీనివాస్, నరహరి, రాజు, రవికాంత్‌రాజు, శ్రీనివాస్‌రెడ్డి, పద్మ, సంపత్, విజేందర్‌రెడ్డి, గీతాలు హర్షం వ్యక్తం చేశారు.

ఆయిల్‌పాం తోట దగ్ధం

వీణవంక: మండలంలోని ఘన్ముక్కుల గ్రామంలో గాలికి విద్యుత్ వైర్లు ఒకటికొకటి తగలడంతో ఆయిల్‌పాం తోట దగ్ధమైంది. గ్రామానికి చెందిన నందికొండ మాధవరెడ్డి మూడు ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేశాడు. గురువారం విద్యుత్ వైర్లు గాలికి ఒకదానికొకటి తగలడంతో నిప్పురవ్వలు చేనులో పడటంతో మంటలు చెలరేగి ఆయిల్‌పాం దగ్ధమైందని బాధితుడు వాపోయాడు. అదేవిధంగా నందికొండ మల్లారెడ్డికి చెందిన నాలుగు ఎకరాల మగ వరి మంటలకు అంటుకొని కాలిపోయిందని అన్నాడు. సంబంధిత అధికారులు స్పందించి న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరారు.

జూనియర్ సివిల్ జడ్జిగా కీర్తన



కట్ట కీర్తన

కరీంనగర్‌క్రైం: నగరంలోని అరెపల్లికి చెందిన కట్ట కీర్తన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. 2021లో హైదరాబాద్‌లోని ప్రైవేట్ లా కళాశాల నుంచి ఎల్‌ఎల్‌బీ, నల్సార్ యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేసింది. హైకోర్టులో, కరీంనగర్ కోర్టులో న్యాయవాదిగా కొనసాగుతూనే జూనియర్ సివిల్ జడ్జి పరీక్షకు సన్నద్ధమైంది. తొలి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. తల్లి పద్మ గృహిణి కాగా, తండ్రి కోటి జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. అక్క శ్రీదేవి పీజీ పూర్తి చేయగా, తమ్ముడు సుదర్శన్ బీటెక్ చదువుతున్నాడు.

సంక్షేమాధికారులకు పోస్టింగ్


- ఎస్సీ వసతిగృహాల్లో నియామకం
- కాళేశ్వరం జోన్‌లో 19మంది రిపోర్టు

మంచిర్యాలఅర్బన్: ఎస్సీ వసతిగృహ సంక్షేమాధికారులుగా ఎంపికై పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు మంచిర్యాల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి బుధవారం రాత్రి నియామక పత్రాలు అందజేశారు. గత ఏడాది జూన్ 24నుంచి 29వరకు కంప్యూటర్ ఆధారిత(సీఆర్‌బీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించగా సెప్టెంబర్ 20న ఫలితాలు విడుదలయ్యాయి. కాళేశ్వరం జోన్ పరిధిలో 24మంది అభ్యర్థులను టీజీపీఎస్సీ ఎంపిక చేసిన పంపగా.. ఐదుగురు అభ్యర్థులు వివిధ కారణాలతో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు రాలేదు. దీంతో 19మందికి నియామక పత్రాలు అందజేయగా.. గురువారం కేటాయించిన వసతిగృహాల్లో రిపోర్టు చేశారు. వీరిలో 12మంది పురుషులు, ఏడుగురు మహిళలు ఉన్నారు. పెద్దపల్లికి ఐదుగురిని కేటాయించారు. తోట శైలజ ఎస్సీ ఐడబ్ల్యూహెచ్‌సీ(గర్ల్స్) పెద్దపల్లి, ఇసంపల్లి రమ్య ఎస్సీ గర్ల్స్ హాస్టల్ మంథని, ప్రశాంత్, ఎస్సీ ఐడబ్ల్యూహెచ్‌సీ బాయ్స్ హాస్టల్ మంథని, డి.తిరుపతి, ఎస్సీడబ్ల్యూహెచ్‌సీ బాయ్స్ హాస్టల్ మంథని, సాధుల రమేశ్, ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్ మంథనికి కేటాయించారు.



నియామకపత్రాలు అందజేస్తున్న ఎస్సీ డీడీ రవీందర్‌రెడ్డి, ఏఎస్‌డబ్ల్యూవో రవీందర్‌గౌడ్





రేపటి నుంచి నృసింహస్వామి నవరాత్రి ఉత్సవాలు

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీలక్ష్మినృసింహ స్వామి జయంతోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈనెల మూడో తేదీ నుంచి 11 వరకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించే స్వామి వారి ఉత్సవాలను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈవో శ్రీనివాస్ తాగునీరు, చలువ పందిళ్లు, భక్తులకు కావాల్సిన లడ్డూప్రసాదాలను సిద్ధం చేశారు.

– ప్రతిరోజూ ఉదయం మంగళవాయిద్యాలతో గోదావరి నుంచి బిందె తీర్థం, ప్రత్యేక అభిషేకాలు, పూజలు, 7న సహస్ర కలశాభిషేకం, 8న చందనోత్సవం, 9న అన్నకూటోత్సవం, పల్లవోత్సవం, వసంతోత్సవం, 10న లక్ష తులసి అర్చన, 11న జయంతి ఉత్సవం నిర్వహించనున్నారు.

జీవాల దాహం తీర్చుదాం



రామగుండం బల్దియాలో ఏర్పాటు చేసిన నీటి తొట్టిలు



గోదావరిఖని ఎల్బీనగర్‌లో పక్షుల కోసం ఏర్పాటు చేసిన నీటితొట్టె

- పెరుగుతున్న గరిష్ట ఉష్ణోగ్రతలు
- తల్లడిల్లుతున్న పక్షులు, జంతువులు
- నివాసాలు, ఖాళీ ప్రదేశాల్లో నీటితొట్టిలు

కోల్‌సిటీ(రామగుండం): వేసవిలో నీటి కోసం జనాలు అల్లాడిపోతారు. వివిధ అవసరాల కోసం ఇంట్లోంచి బయటకు వెళ్తే.. దాహం తీర్చుకునేందుకు నీళ్లు ఎక్కడ లభిస్తాయా? అని ఆశ పడతారు. ఎప్పటికప్పుడు దాహం తీర్చుకునేందుకు తహతహలాడతారు. మరి మూగజీవాల పరిస్థితి ఎలా ఉంటుంది? అవి దాహం ఎలా తీర్చుకుంటాయి? మనం ఏమైనా ప్రయత్నం చేస్తే వాటి దాహం తీరుతుందా? ఇలాంటి సందేహాలకు సమాధానమిస్తున్నారు కొందరు పక్షులు, జీవాల ప్రేమికులు.

పక్షుల శరీర ఉష్ణోగ్రతలు అత్యధికం..

సాధారణంగా పక్షుల శరీర సాధారణ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌గా ఉంటాయని పక్షిప్రేమికులు చెబుతున్నారు. ఈ ఉష్ణోగ్రతలు దాటితే ఎక్కువ సేపు అవి జీవించలేవని అంటున్నారు. అందుకే చాలా పక్షులు ఎక్కడ నీరు కనిపిస్తే అందులో మునకేస్తూ శరీర ఉష్ణోగ్రతలు తగ్గించుకుంటాయి. జనం కోసమైతే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తారు. మరి మూగజీవాల పరిస్థితి ఏమిటి? వీటి కోసం ఎవరు ఆలోచిస్తారు? ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు గరిష్టంగా 45 డిగ్రీల సెల్సియస్‌కు చేరువలో నమోదవుతున్నాయి. అందుకే మూగజీవాలకు ఊపిరి పోయడానికి మనమే ఒకడుగు ముందుకేద్దాం. ఇంటి ఆవరణ, ఇంటి బయట కాసిన్ని నీళ్లు పెట్టి వాటి దాహం తీర్చుదాం.

అందరూ స్పందించాలి

ఉమ్మడి జిల్లాలో ఎక్కడా కుళాయిలు అందుబాటులో లేవు. ఇలాంటి పరిస్థితుల్లో పెంపుడు కుక్కలు, వీధికుక్కలు, పక్షుల దాహం తీర్చేందుకు ప్రతీ ఒక్కరు స్పందించాలి. ప్రభుత్వంతోపాటు ప్రజలు భాగస్వాములు కావాలి. కుక్కలు, పక్షులు గొంతెండి మృత్యువాత పడకుండా ఇంటి ఆవరణ, భవనాల ఎదుట, ప్రధాన కూడళ్లలో నీటితొట్లు ఏర్పాటు చేసి ఎప్పుడూ తాగునీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా పక్షులకు ఇంటిదాబాపై తొట్టిలాంటి మట్టిపాత్రలు ఉంచి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నీటిని పోస్తూ ఉండాలి. వాటికి దాహం వేసిన సమయంలో అలవాటుగా రోజూ అక్కడికి వచ్చి దాహం తీర్చుకుంటాయి. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో అయితే బల్దియా ఆధ్వర్యంలో గతేడాది వేసవిలో సుమారు 90 చోట్ల నీటితొట్టిలు ఏర్పాటు చేసి నీళ్లు పోశారు. వీటిని ప్రస్తుతం పట్టించుకున్న నాథుడు లేడు. కొందరు స్థానికుల ఇళ్ల ఎదుట, దుకాణాల ముందున్న తొట్టిల్లో నీళ్లు పోసి దాహం తీర్చుతున్నారు. ఇలాగే ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తే మంచిదని మూగజీవాల ప్రేమికులు కోరుతున్నారు.



మూగజీవాల దాహం తీర్చడానికి నీటి బకెట్‌ను పెడుతున్న వ్యాపారి యుగేందర్